కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

గన్నేరువరం, అక్టోబర్ 21: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పమేల సత్పతి సూచించారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి గుండ్ల పల్లి, గునుకుల కొండాపూర్ గ్రామాల్లో ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు తాలు లేకుండా సరైన తేమశాతం ఉండేలా ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో కిరణ్మయి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సర్కారు లక్ష్యం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి అక్టోబర్ 21: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు లక్ష్యమని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. సోమవారం మండలంలోని రుక్మాపూర్, కొలిమికుంట, భూపాలపట్నం, వెదురు గట్ట, చొప్పదండి గ్రామాల్లో సహకార సంఘం, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ, సింగిల్‌విండో చైర్మన్ మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా నిలుస్తా

రామడుగు మండల కేంద్రంలోని విన్నర్స్ విద్యాలయంలో పట్టభద్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్‌సింగ్

రామడుగు, అక్టోబర్ 21: నిరుద్యోగులకు అండగా నిలుస్తూ, వారి ప్రగతికి బాటనవుతానని కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్ పేర్కొన్నారు. రామడుగు మండల కేంద్రంలోని విన్నర్స్ విద్యాలయంలో సోమవారం పలువురు పట్టభద్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రవీందర్‌సింగ్ మాట్లాడారు. గతంలో అనేక పదవులు చేపట్టి, ఎన్నో అభివృద్ధి పనులను చేశానన్నారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఇక్కడ మాజీ ఎంపీపీ తౌటు మురళి, మాజీ సర్పంచ్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'అలయ్ బలయ్'కు వచ్చిన అందరికీ కృతజ్ఞతలు

తిమ్మాపూర్, అక్టోబర్ 21: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమానికి వచ్చిన నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరై కార్యకర్తల్లో నూతనోత్తేజం నింపారని, ఇదే ఊపుతో రానున్న స్థానిక సంస్థల్లో అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్క నాయకుడు కష్టపడి పని చేయాలని వారు కోరారు.

జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మిక సందర్శన

మానకొండూర్, అక్టోబర్ 21: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు ఆకస్మికంగా సందర్శించారు. ప్రతి రోజూ విద్యార్థులందరూ తప్పనిసరిగా యూనిఫాం, షూస్ వేసుకుని పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమ్మేటివ్ పరీక్షలు జరుగుతున్న రోజుల్లో కూడా విద్యార్థులు రెండు పూటలు పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. ఒకపూట చదివించి మరొక పూట పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారమిత విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 21 : సౌత్ ఇండియా సదరణ్ డ్రామా ఫెస్టివల్ కోసం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ డ్రామా పోటీల్లో కరీంనగర్ మంకమ్మతోట పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. వారు ప్రదర్శించిన నాటకం బెంగళూరులో జరుగనున్న సౌత్ ఇండియా సదరణ్ డ్రామా ఫెస్టివల్ పోటీలకు అర్హత సాధించిందని పారమిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఈ పోటీలో 'స్వయం కృతాపం' పేరుతో మనిషి ఆధునికత, అభివృద్ధి అనే ఆలోచనలతో ప్రకృతిని వినాశనం చేసి అనారోగ్య సమస్యల విలయంలో ఏవిధంగా కొట్టు మిట్టాడుతున్నాడనే అంశాన్ని చక్కని అభినయ రూపంలో విద్యార్థులు ప్రదర్శించారని ఆయన వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు.

సౌత్ ఇండియా అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు

కొత్తపల్లి, అక్టోబర్ 21: గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 17 నుంచి 19 వరకు జరిగిన 35వ సౌత్ ఇండియా జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ చూపి పతకాలు సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ మహిపాల్, కె. రవి పేర్కొన్నారు. జిల్లాకు చెందిన క్రీడాకారుడు ఎం వినయ్ 3 వేల మీటర్ల పరుగు పందెంలో సిల్వర్, అండర్-14 బాలికల ట్రిథ్లాలన్‌లో జి. నక్షత్ర సిల్వర్ మెడల్స్, 10 వేల కిలోమీటర్ల నడకలో విష్ణువర్ధన్ బ్రాంజ్ మెడల్ సాధించారని వెల్లడించారు. క్రీడాకారులను డీవైఎస్ఓ వీ శ్రీనివాస్‌గౌడ్, కోచ్‌లు అభినందించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మోడల్ విద్యార్థి

సైదాపూర్, అక్టోబర్ 21: సోమారం ఆదర్శ పాఠశాల విద్యార్థి హర్ష రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ విష్ణువర్ధన్ గౌడ్ తెలిపారు. ఇటీవల కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్ 19 ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోటీల్లో అత్యంత ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కుమార్, ఉపాధ్యాయులు హర్షను అభినందించారు.

ఈసీఈ విద్యార్థులకు అపార ఉపాధి అవకాశాలు

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 21: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ రంగంలో విద్యార్థులకు అపార ఉపాధి అవకాశాలు ఉన్నాయని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్ తెలిపారు. సోమవారం సింగాపూర్‌లోని కిట్స్ కళాశాల సమావేశ మందిరంలో రెండో సంవత్సర విద్యార్థులు ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ శంకర్, విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఫ్రెషర్స్ డే వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరయ్య, కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాజేశ్వరరావు, సమావేశ సమన్వయకర్త, అధ్యాపకురాలు గౌరీ పుండలిక్, డీన్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బి. రమేశ్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్, జి. మల్లయ్య, అధ్యాపకులు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 21: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను వెంటనే అమలు చేయాలని, అప్పటి వరకు అన్ని రకాల ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్ అధ్యక్షతన హుజూరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామిమాదిగ మాట్లాడుతూ.. మాలల ఒత్తిడికి తలొగ్గి వర్గీకరణ లేకుండానే ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 27న జగిత్యాలలో తలపెట్టిన సదస్సుకు హుజూరాబాద్ నియోజకవర్గంలోని మాదిగ విద్యార్థులు, ఎమ్మార్పీఎస్ అన్ని అనుబంధ విభాగాల కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రామచంద్రం, సాగర్, రవీందర్, మధు నయ్య, రాజ్ కుమార్, అరుణ్, రవి తేజ, రాకేశ్, రక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ రికార్డ్స్ పరిశీలించిన డీఎల్‌పీవో

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 21: దుర్శేడ్ గ్రామపంచాయతీలోని రికార్డులు, జీపీ యాప్‌ను డివిజనల్ పంచాయతీ రాజ్ అధికారి శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఇంటి పన్నుల వసూలు, తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శి పద్మను అడిగి అడిగి తెలుసుకున్నారు. వైకుంఠ ధామం, నర్సరీలను సందర్శించారు. ఇక్కడ ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, కారోబార్ మురళి తదితరులు ఉన్నారు.

క్రీడాకారిణికి ఎమ్మెల్యే అభినందన

గంగాధర, అక్టోబర్ 21 : హర్యానా రాష్ట్రంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్ బాల్ పోటీల్లో మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మర్రిగడ్డకు చెందిన ఎరవేని స్రవంతి ప్రతిభ చూపింది. సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో క్రీడాకారిణి స్రవంతిని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సింగదాసరి నారాయణ, దుబ్బాసి బుచ్చయ్య, తూడి శ్రీనివాస్, తూడి రవి, ఎరవేని కనకయ్య, ఎరవేని చంద్రయ్య, రేగుల మల్లేశం, తూడి తిరుపతి, తూడి మహేశ్, ఎరవేని రాజేశం, ఎరవేని లచ్చయ్య ఉన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..!

- ప్రయోజనం లేని ప్రజావాణి
- పట్టింపులేని అధికారులు..
  తొలగని ఇబ్బందులు
- అర్జీదారుల ఆవేదన

అర్జీ స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్

కలెక్టరేట్, అక్టోబర్ 21 : సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఉన్నతాధికారుల వద్ద పరిష్కారం లభిస్తుందని ఆశించిన వారికి ప్రజావాణిలో నిరాశే ఎదురవుతున్నది. వరుసగా ఆరుసార్లు ప్రజావాణికి వచ్చి అర్జీలు అందజేసినా, ప్రయోజనమే లేదంటూ దరఖాస్తుదారుల నుంచి నిర్లిప్తత వ్యక్తమవుతున్నది. తామిచ్చిన ఫిర్యాదులపై అధికారులకు పట్టింపు లేకపోవడంతో తమ ఇబ్బందులు తొలగడం లేదని అనేక మంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి తమ ఇబ్బందులకు పరిష్కార మార్గం చూపితే, వారి మేలు మరిచిపోలేమని స్పష్టం చేస్తున్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై దరఖాస్తులు అందించారు. వాటిని అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ స్వీకరించి, ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. సకాలంలో వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

ఇంటి హద్దులు చెరిపేసిన వారిపై చర్యలేవి?

దశాబ్దాలుగా మేము నివాసముంటున్న ఇంటి హద్దులు చెరిపేసి, ఖాళీ స్థలం ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్న వారిపై గత ఆగస్టులో ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. దానిని పోలీస్ స్టేషన్‌కు సిఫారసు చేశారు. రెండో పట్టణ పోలీసులు వచ్చి పరిశీలించినా, ఇప్పటివరకు దౌర్జన్యం చేసిన వారిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై గత నెల నుంచి వరుసగా ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్నా. ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు.

-ఆంజనేయులు, వావిలాలపల్లి, కరీంనగర్

మా ఖాతాల్లో జమైన మొత్తం కూడా తీసుకోనివ్వరా

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మా బ్యాంకు ఖాతాల్లో జమచేసిన డబ్బులు కూడా మమ్మల్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకోనివ్వడం లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దళితులను ఆదరిస్తుందని ఆశిస్తే, మాకు నిరాశే మిగులుస్తున్నది. మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తుండడం మంచిది కాదు. దళితులంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మారుతున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారు.

- సరిత, దళితబంధు లబ్ధిదారు, జమ్మికుంట

సబ్సిడీ రుణం మంజూరైనా అందలేదు

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణానికి 2018-19లో దరఖాస్తు చేసుకున్న. ఇటీవల పలువురు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయి. నాకు మాత్రం కాలేదు. దీనిపై సంబంధిత అధికారులను ఆరా తీస్తే పట్టించుకోవడం లేదు. ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన. అందరిలాగే నాకు కూడా సబ్సిడీ మొత్తం జమచేసి, వచ్చే వేసవిలో జ్యూస్ సెంటర్ ఏర్పాటు చేసుకునేలా సహకరించాలి.

- వడ్ల సంపత్, లష్కన్నపల్లి, సైదాపూర్ మండలం

పోలీసు అమరవీరుల యాదిలో..

- పోలీసు కమిషనరేట్ కేంద్రంలో ఫ్లాగ్ డే
- పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిది
- కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి
- జిల్లా వ్యాప్తంగా అమరులకు ఘన నివాళి

పోలీసు కమిషనరేట్ కేంద్రంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీ అభిషేక్ మొహంతి, ఇతర అధికారులు

రాంనగర్/ మానకొండూర్/ చొప్పదండి/ గంగాధర, అక్టోబర్ 21: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అమరుల విగ్రహాలు, స్తూపాల వద్ద నివాళులర్పించి, వారి సేవలను కొనియాడారు. ఇందులో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో పోలీసు అమరవీరుల స్తూపం వద్ద ఫ్లాగ్ డే కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి హాజరయ్యారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమానికి హాజరైనవారంతా పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ, దేశ రక్షణ, సమాజంలో శాంతి భద్రతలు కాపాడడంలో పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిదన్నారు. వారి త్యాగాలు ఎప్పటికీ వృథా కావన్నారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని విధులు నిర్వహిస్తామన్నారు. అమరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మానకొండూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ సమీపంలోని దివంగత ఎస్ఐ ఉండింటి సంజీవ్ విగ్రహానికి సీఐ లక్ష్మీనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నయిమోద్దీన్, పోలీస్ సిబ్బంది, సంజీవ్ సోదరులు, కుటుంబ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. గంగాధర పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న పోలీస్ అమరుడు గుజ్జేటి మహేశ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహేశ్ కుటుంబాన్ని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేందర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ అనూష ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరం ద్వారా 34 యూనిట్ల రక్తాన్ని సేకరించి కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు అప్పగించారు. కార్యక్రమంలో సేవ్ ద లైఫ్ ఫౌండేషన్ ఫౌండర్ ముప్పిడి రాజ్ కుమార్, కరీంనగర్ సివిల్ హాస్పిటల్ డాక్టర్ ఉషారాణి, పోలీసు సిబ్బంది, మండల ప్రజలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

సైదాపూర్, అక్టోబర్ 21: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. మండలంలోని దుద్దనపల్లి గ్రామంలో సోమవారం ఉడిగె విజయారాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు ఉచిత బస్‌పాసుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, పాసులను అందించారు. ఆర్టీసీబస్సులోనే ప్రజలు ప్రయాణించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తాటిపల్లి యుగేంధర్‌రెడ్డి, నాయకుడు ఉడిగె రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'జాతీయ విద్యా విధానం అమలు వద్దు'

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 21: రాష్ట్రంలో జాతీయ విద్యావిధానం-2020 అమలు చేసే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, అలాగే అసెంబ్లీలో నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ ప్రపుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఏఐఎస్ఎఫ్ నాయకుడు సతీశ్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, అక్టోబర్ 21: లోయర్ మానేరు జలాశయం నుంచి రెండు గేట్ల ద్వారా 6వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. ఆరు వేల క్యూసెక్కుల జలాలు ఇన్‌ఫ్లోగా వస్తున్నాయి. ఆదివారం ఉదయం 4వేల క్యూసెక్కుల నీటి విడుదల ప్రారంభించిన అధికారులు, రెండోరోజు రెండు వేల క్యూసెక్కులు పెంచి మొత్తం ఆరువేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. 24టీఎంసీల సామర్థ్యం గల ఎల్ఎండీలో పూర్తి స్థాయిలో నీళ్లు ఉన్నాయి.

యువత రాజకీయాల్లోకి రావాలి

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 21: యువత రాజకీయాల్లోకి రావడం ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుందని, ప్రలోభాలకు లొంగకుండా.. సమర్థవంతుడైన పట్టభద్రుడిని ఎమ్మెల్సీగా ఎన్నుకుందామని రాష్ట్ర ఎన్జీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని పద్మనగర్ ఇందిరాగార్డెన్‌లో నవ తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పట్టభద్రులు, విద్యార్థులు, యువతతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు తెలంగాణ చౌక్ నుంచి ఇందిరాగార్డెన్ వరకు విద్యార్థులతో కలిసి బైక్ భారీ ర్యాలీ నిర్వహించారు.

శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్, అక్టోబర్ 21: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ చైతన్య డిఫెన్స్, స్పోర్ట్స్ అకాడమీకి చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యాంసుందర్‌రెడ్డి, పీడీ లెంకల మహిపాల్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

బస్సు నిలుపలేదని డీఎంకు ఫిర్యాదు

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 21: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ వద్ద ఆర్టీసీ బస్సు నిలుపలేదని అదే గ్రామానికి చెందిన కోమూరి రేణుక సోమవారం హుజూరాబాద్ డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేసింది. పని మీద హుజూరాబాద్‌కు వెళ్లడానికి శాలపల్లి బస్టాండ్ వద్ద సిద్ధంగా ఉన్న తాను, జమ్మికుంట నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సును ఆపినా కూడా డ్రైవర్ నిలుపకుండా వెళ్లిపోయాడని డీఎం కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేసింది. ఆమె వెంట ఇదే గ్రామానికి చెందిన వెల్పూల విజయ్‌కుమార్, జడల అశోక్ ఉన్నారు. బస్సు ఆపకుండా వెళ్లిపోయిన డ్రైవర్‌పై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

బీసీ సంఘం మండలాధ్యక్షుడిగా సుధాకర్

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 21: బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ రూరల్ మండలాధ్యక్షుడిగా మాసం సుధాకర్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి గొర్ల అయిలేశ్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎల్లమ్మ గుడిలో చోరీ

గన్నేరువరం, అక్టోబర్ 21: మండలంలోని గునుకుల కొండాపూర్ ఎల్లమ్మ గుడిలో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్టు ఎస్ఐ నరేశ్ తెలిపారు. ఈ చోరీలో మూడు తులాల వెండి ముక్కు పుడక, హుండీలోని సుమారు రూ.5 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని ఆలయ అధ్యక్షుడు న్యాలపట్ల పరశురాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌కో ఉద్యోగి దుర్మరణం

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 21: తుమ్మనపల్లి గ్రామ శివారులోని కాకతీయ కాలువ సమీపంలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ట్రాన్స్‌కో ఉద్యోగి దుర్మరణం చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఇల్లందకుంట మండలం మల్యాల గ్రామానికి చెందిన మేదరి సాయిరమణ(35) శంకరపట్నం మండలం ఆముదాలపల్లి, మెట్టుపల్లి గ్రామాల్లో అసిస్టెంట్ జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధులు ముగించుకొని ద్విచక్రవాహనంపై వస్తుండగా, తుమ్మనపల్లి శివారులో అదుపు తప్పి పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, ప్రమాదం జరిగిన స్థలంలో రెండు రోజుల క్రితం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. సిగ్నల్ పెట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిగ్నల్స్ లేని స్పీడ్ బ్రేకర్లు తొలగించాలని కోరుతున్నారు.

నాణ్యమైన విద్యతో ఉజ్వల భవిష్యత్తు

తిమ్మాపూర్, అక్టోబర్ 21: రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ విభాగాల్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు 'దిశారంభ్' పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల జనరల్ సెక్రటరీ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. నాణ్యమైన విద్యతో ఉజ్వల భవిష్యత్తును అందిస్తామన్నారు. కేవలం డిగ్రీలు పొందితే ఉద్యోగాలు రావని, సంస్థలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ డీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, హెచ్‌వోడీలు హరిప్రసాద్, వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించాలి

సైదాపూర్, అక్టోబర్ 21: ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై శ్రద్ధ వహించాలని ఎంపీడీవో యాదగిరి సూచించారు. మండలకేంద్రంలోని వెన్కేపల్లి ఉన్నత పాఠశాలలో రూ. 2.5లక్షలతో నిర్మించిన స్కూల్ టాయిలెట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి డాక్టర్ విజేందర్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, గ్రామ కార్యదర్శి రాజేశ్వర్‌రావు, హెచ్ఎం దేవేందర్‌రెడ్డి, నాయకులు కొండ గణేశ్, గడ్డం శేఖర్, ఎర్రల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుడికి స్థలం కేటాయించాలని వినతి

శంకరపట్నం, అక్టోబర్ 21: కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి దేవాలయ గుట్ట ఎదురుగా ఉన్న పెద్ద